A1 TV NEWS

# ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంచిక :01 సంపుటి : 33 శనివారం। 29। జూలై ।2023 పేజీలు 4. వేల :4 /

### వరద ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, అధికారులతో

# సీఎం జగన్ సమీక్ష.

### -ముంపు ప్రాంతాల్లో కచ్చా ఇళ్లు దెబ్బతింటే రూ. 10వేలు ఇవ్వండి.



ఆంధ్ర ప్రగతి తాడేపల్లి జూలై 28: ఆంధ్రప్రదేశ్‌తోపాటు, తెలంగాణ, ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి, కృష్ణా, ఇతర నదులు, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఏపీలోని కొన్ని జిల్లాలు వరద ముంపునకు గురయ్యాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వివిధ జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏపీలోని అల్లూరి సీతారామరాజు, ఏలూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, అంబేద్కర్ కోనసీమ జిల్లాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం జగన్ సూచించారు. రోజు రోజుకీ భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతుండటంతో.. ముంపు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని సీఎం ఆదేశించారు.

మిగతాది 2లో...

### వర్షాలకు హైదరాబాద్ సిటీయే

# మునిగిపోయింది

### బొత్స సత్యనారాయణ

ప్రత్యేక సందర్భాలలో వచ్చే వర్షాలకు మునగడం సహజమేనని వ్యాఖ్య

చంద్రబాబు అభివృద్ధి గురించి మాట్లాడటం విడ్డూరమన్న బొత్స

కుప్పం కంటే విజయనగరం చాలా బాగుంటుందన్న మంత్రి



ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు హైదరాబాద్ వంటి సిటీయే మునిగిపోయిందని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అభివృద్ధిపై మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఒకసారి ఆయన విజయనగరం వచ్చి అభివృద్ధి అంటే ఏమిటో చూడాలని సూచించారు. కుప్పం కంటే మా జిల్లా ఎంతో బాగుంటుందన్నారు. వర్షాల నేపథ్యంలో ముంపుపై విపక్షాలు విమర్శించడం మీదా బొత్స స్పందించారు. వర్షాలకు హైదరాబాదే మునిగిపోయిందని గుర్తు చేశారు. ప్రత్యేక సందర్భాలలో వచ్చే వర్షాలకు మునగడం సహజమన్నారు.

హైకోర్టు నోటీసులపై స్పందనఅమ్మఒడి సభకు విద్యార్థులను తీసుకువెళ్లడంపై విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కార్యదర్శికి హైకోర్టు నోటీసులు ఇవ్వడంపై బొత్స స్పందించారు. ఈ కార్యక్రమానికి తల్లిదండ్రులు, విద్యార్థులు రావడంలో తప్పులేదన్నారు. వారు కాకుండా ఇలాంటి కార్యక్రమాలకు సినిమా యాక్టర్లు వస్తారా? అని ప్రశ్నించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల రాకపై కోర్టు సూచనలు ఇస్తే పాటిస్తామన్నారు.

# మహారాష్ట్రను కుదిపేస్తున్న వర్షాలు

### -భారీ వర్షాలతో పాఠశాలలకు సెలవులు

ముంబయి,జూలై28 :



గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు మహారాష్ట్రను అతలాకుతలం చేస్తున్నాయి. రాజధాని ముంబయితో పాటు పూణె, నాగ్‌పూర్, షోలాపూర్‌లోని లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. గడిచిన 24 గంటల్లో ముంబయి శివారు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసిందని అధికారులు తెలిపారు. శుక్రవారం ఉదయం కూడా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోందని అన్నారు. నేడు నగరంలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, నగరానికి రెడ్ అలెర్ట్ జారీ చేసినట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండి) వెల్లడించింది. దీంతో నగరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు బృహన్ ముంబయి మునిసిపల్ కార్పొరేషన్ (బిఎంసి) తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటికి రాకూడదని బిఎంసి హెచ్చరించింది.గత 24 గంటల్లో ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినల్‌లో 153.5 మి.మీ, బైకుల్లాలో 119 మి.మీ, బాంద్రాలో 106 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఐఎండి అధికారులు తెలిపారు.

## పవన్ వల్ల ఎంత మంది మహిళలు

## కనిపించకుండా పోయారో లెక్కించాలి: రోజా

-మహిళల మిస్సింగ్ పై ఏ సంస్థ సమాచారమిచ్చిందో పవన్ చెప్పాలని రోజా డిమాండ్

- అసలైన రాయలసీమ ద్రోహి చంద్రబాబు అని విమర్శ

- రాయలసీమ ప్రాజెక్టులను సందర్శించే హక్కు కూడా లేదని వ్యాఖ్య



ఏపీలో జరుగుతున్న మహిళల అక్రమ రవాణా వెనుక కొంత మంది వాలంటీర్ల హస్తం ఉందని జనసేన అధినేత ఆరోపించిన సంగతి తెలిసిందే. మరోవైపు ఏపీలో 27 వేల మంది మహిళలు అదృశ్యమయ్యారని రాజ్యసభలో కేంద్ర ప్రభుత్వం కూడా ప్రకటించింది. ఈ క్రమంలో ఏపీ మంత్రి రోజా మాట్లాడుతూ పవన్ పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వపన్ కల్యాణ్ వల్ల ఎంత మంది మహిళలు కనిపించకుండా పోయారో లెక్క తేలాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు. ఏపీలో మహిళల మిస్సింగ్ పై పవన్ కు ఏ నిఘా సంస్థ సమాచారమిచ్చిందో ఆయన చెప్పాలని డిమాండ్ చేశారు. మరోవైపు టీడీపీ అధినేత చంద్రబాబుపై కూడా రోజా విమర్శలు గుప్పించారు. అసలైన రాయలసీమ ద్రోహి చంద్రబాబు అని అన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ రాయలసీమకు ఆయన చేసిందేమీ లేదని చెప్పారు. రాయలసీమ ప్రాజెక్టులను సందర్శించే నైతిక హక్కు కూడా చంద్రబాబుకు లేదని అన్నారు. హెరిటేజ్ షాపుల్లో గంజాయి, నారావారిపల్లిలో ఎర్రచందనం దొరుకుతాయని ఆరోపించారు.

# ఆగస్ట్ 3 నుండి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

**-శాసన సభ, మండలి సమావేశాల తేదీల ఖరారు**

**-వచ్చే నెల మొదటి వారంలో సమావేశాలు ప్రారంభించాలని ప్రభుత్వ నిర్ణయం**

**-ఎన్నికలకు ముందు ఇవే చివరి అసెంబ్లీ సమావేశాలు!**



తెలంగాణ శాసన సభ సమావేశాలు ఆగస్ట్ 3వ తేదీ నుండి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు తెలంగాణ శాసన సభ, శాసనమండలి సమావేశాల తేదీలు ఖరారయ్యాయి. వచ్చే నెల మొదటి వారంలో సమావేశాలు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 12తో ముగిశాయి. ఆరు నెలల గడువు ప్రకారం ఆగస్ట్ 11లోపు తిరిగి అసెంబ్లీ సమావేశం కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆగస్ట్ మొదటి వారంలో అసెంబ్లీ, కౌన్సిల్ సమావేశం కానుంది. ఎన్నికలకు ముందు ఇవే చివరి అసెంబ్లీ సమావేశాలు అయ్యే అవకాశముంది.

# ఓఆర్ఆర్ టెండర్ల సమాచారంలో గోప్యత ఎందుకు

హైదరాబాద్,జూలై28( :

ఓఆర్ఆర్ టెండర్ల సమాచారాన్ని గోప్యంగా ఉంచడంలో అర్థం లేదని, ఓ ఎంపి అడిగితే దానిని ఎందుకు ఇవ్వడం లేదని తెలంగాణ ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. అడిగిన సమాచారాన్ని లిఖితపూర్వకంగా 15రోజుల్లో ఎంపి రేవంత్ కెడ్డికి ఇవ్వాలని ఆదేశించింది. ఇందుకు ప్రభుత్వం కూడా హైకోర్టులో ఒప్పుకుంది. సమాచారాన్ని గోప్యంగా ఉంచుతున్నారని, ఆర్టీఐ పిటిషన్ ద్వారా అడిగినా ఇవ్వడం లేదని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిగింది. ఆర్టీఐ ఉన్నది ఎందుకని విచారణ సందర్భంగా హైకోర్టు ధర్మాసనం ప్రశ్నించింది. ఎంపీలు, ఎమ్మెల్యేలకు కూడా అడిగిన సమాచారం ఇవ్వకపోతే చట్టసభల్లో వారు ఏం మాట్లాడుతారని ప్రశ్నించింది. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి అడిగిన సమాచారం మొత్తం ఇస్తామని ప్రభుత్వం తరపున అటార్నీ జనరల్ కోర్టుకు తెలిపారు. రెండు వారాల్లోగా రేవంత్ రెడ్డి అడిగిన సమాచారం ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. ఓఆర్ఆర్ టెండర్లపై 26న ఆయన హైకోర్టులో పిటిషన్ వేశారు. లీజు టెండర్ల విషయంలో తక్కువ మొత్తానికి కేటాయించి ముంబైకి చెందిన కంపెనీకి కట్టబెట్టారని, ఇందులో అధికార బీఆర్ఎస్ హస్తం ఉందని రేవంత్ పదే పదే ఆరోపిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో ఆర్టీఐ కూడా సమాచారం ఇవ్వకపోవడం.. ప్రభుత్వం నుంచి పెద్దగా స్పందన రాకపోవడంతో హైకోర్టులో పిటిషన్ వేశారు. రాజకీయవర్గాల్లో చర్చనయాంశమయింది. ఆర్టీఐకి కమిషనర్‌లు లేకపోవడంతోనే సమాచారం రావడం లేదని చెబుతున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు ఓఆర్ఆర్ లీజ్ పై పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కొంత కాలంగా సంచలన ఆరోపణలు చేస్తున్నారు. ఓఆర్ఆర్ లీజులో భారీ స్కామ్ జరిగిందని, ఈ కుంభకోణంలో దాదాపు వెయ్యి కోట్ల రూపాయలు చేతులు మారాయని రేవంత్ రెడ్డి ఆరోపిస్తున్నారు. ఈ ఓఆర్ఆర్ లీజ్ స్కాములో తెలంగాణ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి సీఎస్ సోమేష్ కుమార్, మరో అధికారి అరవింద్ కుమార్ కీలక పాత్రధారులు అంటున్నారు. ఓఆర్ఆర్ లీజ్ స్కామ్ లో విచారణ సంస్థకు ఆధారాలతో సహా ఫిర్యాదు చేస్తామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. విదేశీ పెట్టుబడులకు కీలకంగా మారిన ఓఆర్ఆర్ కు ప్రతి సంవత్సరం రూ. 700 నుండి రూ.800 కోట్ల వరకు టోల్ రూపంలోనే వస్తాయని రేవంత్ రెడ్డి చెబుతున్నారు. ఈ టెండర్ దక్కించుకునేందుకు నాలుగు కంపెనీలు టెండర్ల కోసం బిడ్లు దాఖలు చేయగా.. దరఖాస్తుల పరిశీలన తర్వాత ఐఆర్బీ ఇన్‌ఫ్రా లిమిటెడ్ ఎల్1గా నిలిచింది. మొత్తం రూ.7,380 కోట్లకు బిడ్ ఖరారు అయింది. ఈ మొత్తం ఒకేసారి ప్రభుత్వానికి అందించాల్సి ఉంటుంది. లీజు కుదరడం తో ఇక నుండి నిర్వహణ నుండి టోల్ వసూలు వరకు ప్రైవేట్ సంస్థ పరిధిలోకి వెళ్లనున్నాయి. గత సంవత్సర కాలంగా దీనిపై హెచ్ఎండీఏ కసరత్తు చేస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో టెండర్లు పిలిచింది. మార్చి నెలాఖరుకు టెండర్ గడువు ముగిసిన తర్వాత మొత్తం 4 కంపెనీలు తమ బిడ్లను దాఖలు చేశాయి. ఎక్కువగా కోట్ చేసిన సంస్థకు ఓఆర్ఆర్ ను టోల్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ విధానంలో లీజుగు అప్పగించారు. ఇందులో భాగంగా ముంబయికి చెందిన ఐఆర్బీ ఇన్‌ఫ్రా లిమిటెడ్ కి బిడ్ దక్కింది. ఇందులో అవినీతి జరిగిందని రేవంత్ రెడ్డి ఆరోపిస్తున్నారు. ఓఆర్ఆర్ ను మొత్తం 158 కిలోమీటర్ల మేర నిర్మించారు. పలు జాతీయ, రాష్ట్ర రహదారులు దీనికి



అనుసంధానమై ఉన్నాయి. ఓఆర్ఆర్ పై ఎక్కి, దిగడానికి 44 పాయింట్లు ఉన్నాయి. అలాగే 22 ఇంటర్ ఛేంజ్ జంక్షన్లు ఉన్నాయి. టోల్ వసూళ్ల కింద ఏటా రూ.400 నుండి రూ.450 కోట్ల వరకు ఆదాయం సమకూరుతుంది. దీనిని ఏటా 5 శాతం వరకు పెంచుకునే వెసులుబాటు ఉంది. అయితే రేవంత్ రెడ్డి ఆరోపణలన్నీ తప్పని ఇప్పటికే హెచ్ఎండీఏ ఆయనపై పరువు నష్టం పిటిషన్లు దాఖలు చేసింది. అవి కూడా కోర్టులో ఉన్నాయి.

# వరద ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, అధికారులతో సీఎం జగన్ సమీక్ష.

అధికారులు మంచి చేశారు అని చెప్పుకోవాలి...
ధవళేశ్వరం వద్ద గోదావరి వరద ప్రమవాహం సుమారు 16 లక్షలకు చేరుకునే అవకాశాలు ఉన్నట్టుగా అధికారులు అంచనా వేస్తున్న తరుణంలో కలెక్టర్లు అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలని సీఎం తెలిపారు. వరద ప్రభావం ఉన్న ప్రాంతాల్లో సహాయ, పునరావాసం కార్యక్రమాలు అత్యంత సమర్థవంతంగా సాగాలన్నారు. అధికారులు మానవీయ కోణంలో సాయం అందించాలన్నారు. డబ్బుల గురించి ఆలోచించకుండా బాధితులకు అండగా ఉండాలన్నారు. అధికారులు తమకు మంచి చేశారు అన్న మాటే తనకు వినిపించాలని సీఎం చెప్పారు.

నిత్యావసరాలు అందరికీ అందజేయాలి

ఇప్పటికే లోతట్టు ప్రాంతాల ప్రజల ఇళ్లు ఖాళీ చేసి పునరావాస కేంద్రాలకు పంపినట్లు అధికారులు సీఎంకు వివరించారు. అవసరం అనుకుంటే%ా% పరిస్థితిని అంచనా వేసుకుని మిగిలిన ప్రజలను కూడా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సీఎం జగన్ తెలిపారు. సహాయ శిబిరాల్లో అన్ని రకాల సదుపాయాలు కల్పించాలన్నారు. సహాయ శిబిరాల నుంచి తిరిగి ఇళ్లకు పంపించేటప్పుడు ప్రతి కుటుంబానికి రూ.2వేలు రూపాయలు ఇవ్వాలని, వ్యక్తులైతే వారికి రూ.1000లు ఇవ్వాలని అధికారులకు సూచించారు. కచ్చా ఇళ్ల విషయంలో కలెక్టర్లు మానవీయ దృక్పథంతో ఉండాలన్నారు. కచ్చా ఇళ్లు ఉన్న ప్రతి ఒక్కరికీ రూ.10వేలు ఇవ్వాలని సీఎం ఆదేశించారు. ఇలాంటి సమయాల్లో వారికి బాసటగా అధికారులు నిలవాలన్నారు. అలాగే ముంపునకు గురైన ఇళ్లు, అలాగే వరదనీరు ప్రవహించిన ఇళ్లు ఉన్న ప్రాంతాల్లో నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలన్నారు. ఉదారంగా నిత్యావసరాలను పంపిణీ చేయాలన్నారు. 25 కేజీల బియ్యం, కేజీ ఉల్లిపాయలు, కేజీ బంగాళాదుంపలు, కేజీ పామాయిల్, కేజీ కందిపప్పు ఇవ్వాలన్నారు.

ఈ నాలుగు సంవత్సరాల్లో ప్రతి ఏడాది కూడా ఇలాంటి పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొంటున్నామన్నారు. కంట్రోలు రూమ్స్ ఏర్పాటు చేయడం, జిల్లా స్థాయి నుంచి మండల స్థాయివరకూ కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయాలన్నారు. సచివాలయ స్థాయిలో కూడా కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. సచివాలయాల సిబ్బందిని, వాలంటీర్ల సేవలను పూర్తిగా వినియోగించుకోవాలని, ముంపు బాధిత గ్రామాల మీద, లంకల మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఆయా ప్రాంతాల్లో నిత్యావసర వస్తువులు సరిపడా నిల్వ ఉండేలా చూసుకోవాలన్నారు. లంక గ్రామాలలో జనరేట్లర్లు లాంటివాటిని సిద్ధంచేసుకోవాలన్నారు. తాగునీటి కొరత లేకుండా, తాగునీటి సరఫరా వ్యవస్థలు నిలిచిపోకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు ఆయా గ్రామాల్లో ముమ్మరంగా చేపట్టాలన్నారు. అలాగే ఆరోగ్య శిబిరాలను కూడా ఏర్పాటు చేయాలన్నారు. వరదల కారణంగా పాముకాట్లు పెరుగుతాయి, వీటికి అవసరమైన మందులను అందుబాటులో చేసుకోవాలన్నారు. వరదనీరు తగ్గాక పంట నష్టం వివరాలను నమోదు చేసుకుని రైతులకు బాసటగా నిలిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. అత్యంత పారదర్శకత పద్ధతిలో నష్టపరిహారం చెల్లించాలని అధికారులకు సీఎం జగన్ సూచించారు.

ఈ కార్యక్రమంలో హెూం, విపత్తు నిర్వహణశాఖ మంత్రి తానేటి వనిత, సీఎస్ డాక్టర్ కె ఎస్ జవహర్ రెడ్డి, డీజీపీ కె వి రాజేంద్రనాథ్ రెడ్డి, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ జి సాయి ప్రసాద్, పురపాలక,పట్టణాభివృద్ధిశాఖ స్పెషల్ సీఎస్ వై శ్రీలక్ష్మి, వ్యవసాయశాఖ స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది, ఇంధనశాఖ స్పెషల్ సీఎస్ కె విజయానంద్, పౌరసరఫరాలశాఖ కమిషనర్ హెచ్ అరుణ్‌కుమార్, ఆర్అండ్‌బి కార్యదర్శి పీ ఎస్ ప్రద్యుమ్న, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ పి. కోటేశ్వరరావు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ ఎ సూర్యకుమారి, ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ జి లక్ష్మీషా, ఏపీ విపత్తు నిర్వహణశాఖ డైరెక్టర్ డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# బీసీలపై టీడీపీ చేస్తున్న అసత్యాలను ఎండగట్టిన వైఎస్సార్ సీపీ రాజ్యసభ సభ్యులు.

## -రాష్ట్రానికి బీసీలు వెన్నెముక అని నమ్మిన వ్యక్తి సీఎం జగన్

ఆంధ్ర ప్రగతి న్యూఢిల్లీ జులై 28:
ఆంధ్రప్రదేశ్‌లో బీసీ సామాజిక వర్గాలకు రాజకీయంగా, సామాజికంగా ప్రాధాన్యం ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ రాజ్యసభ సభ్యులు తెలిపారు. వాస్తవాలను వక్రీకరించి.. అవాస్తవాలను ప్రచారం చేయడంతో టీడీపీ నాయకుడు నారా లోకేష్ తండ్రిని మించిపోతున్నారని వారు ఎద్దేవా చేశారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో గురువారం నారా లోకేష్ 'జయహెూ బీసీ' సదస్సు పెట్టి ప్రజల్ని మభ్యపెట్టే ప్రయత్నాలు చేశారని వైఎస్సార్‌సీపీ ఎంపీలు దుయ్యబట్టారు. ఈ సందర్భంగా దేశ రాజధాని ఢిల్లీలో రాజ్యసభ సభ్యులు ఎంపీ మోపిదేవి వెంకట రమణా రావు, పిల్లి సుభాష్, బీదా మస్తాన్ రావు, సత్యవతి, బి. చంద్రశేఖర్ లు కలిసి శుక్రవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీని లక్ష్యంగా చేసుకుని అవాస్తవాలను ప్రచారం చేస్తున్న నారా లోకేష్, టీడీపీ నాయకుల వ్యాఖ్యలను ఎంపీలు ఖండించారు.

రిషికేశ్వరి చనిపోతే లోకేష్ ఎందుకు వెళ్లలేదు..?

బీసీలను టీడీపీ ఉద్ధరించినట్లు నారా లోకేష్ ఊదరగొడుతున్నారని ఎంపీ మోపిదేవి వెంకట రమణ మండిపడ్డారు. ఇటీవల రేపల్లెలో జరిగిన ఓ సంఘటనను అడ్డంపెట్టుకుని లోకేష్ రాజకీయం చేయాలని చూస్తున్నారని ఆయన ఆరోపించారు. రేపల్లెకు చెందిన అమర్నాథ్ అనే బిడ్డ చనిపోతే.. అతని కుటుంబాన్ని ఆదుకున్నది సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని ఎంపీ మోపిదేవి పేర్కొన్నారు. ఘటన జరిగిన 24 గంటల్లోనే నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధిత కుటుంబానికి వెంటనే రూ.10లక్షలు ప్రభుత్వ సాయం, ఒక రూ.లక్ష వ్యక్తిగత సాయంతోపాటు.. కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఇల్ల స్థలం, ఇల్లు కట్టించి ఇచ్చే బాధ్యతను తమ ప్రభుత్వం తీసుకుందన్నారు. బాధిత కుటుంబంలోని ఆ చిన్నపిల్లను రెచ్చగొట్టి ఏవేవో మాట్లాడించాలని లోకేష్ ప్రయత్నించడం సిగ్గుచేటని ఎంపీ మోపిదేవి అన్నారు. ఇక టీడీపీ హయాంలో రిషికేశ్వరి అనే అమ్మాయి ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో చనిపోతే కనీసం చంద్రబాబు, లోకేష్ ఎవరూ పరామర్శించిన పాపానపోలేదన్నారు. మరి ఆ రోజు లోకేష్ ఎక్కడ నిద్రపోతున్నాడో చెప్పాలని ఎంపీ డిమాండ్ చేశారు.

బీసీలకు వైసీపీ చేసిన మంచి ఇదీ..

2014 నుంచి 2019 మధ్య కాలంలో టీడీపీ హయాంలో బీసీల సాధికారత, వారు ఆర్థికంగా సామాజికంగా, రాజకీయంగా ఎదగడానికి ఏం చేశారో చెప్పాలని ఎంపీ మోపిదేవి డిమాండ్ చేశారు. అదే వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే.. బీసీలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా కూడా ఎదిగేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎంతో ప్రాధాన్యం కల్పించారని ఎంపీ తెలిపారు. రాష్ట్రంలో బీసీ కమిషన్ ఏర్పాటు చేయడం, అసెంబ్లీ



స్పీకర్ బీసీకి కేటాయించడం, కేబినెట్‌లో దాదాపు 11 మంది బీసీలు మంత్రులుగా ఉన్నారని, రాజ్యసభకు బీసీలను ఏనాడు టీడీపీ ఒక్కరిని కూడా పంపిన సందర్భాలు లేవని, అలాంటిది సీఎం జగన్ నలుగురిని రాజ్యసభకు పంపారన్నారు. లోక్‌సభలో ఆరుగురు బీసీలు ఎంపీలుగా ఉన్నారని, ఇక 31 మంది ఎమ్మెల్యేలు, 12 మంది ఎమ్మెల్సీలు, 56 బీసీ కార్పొరేషన్ ఛైర్మన్లు, 9 మంది జడ్పీ ఛైర్మన్లు, 9 మంది మేయర్లు, 215 మంది జడ్పీటీసీలు బీసీ సామాజిక వర్గానికి చెందిన వారు ఉన్నారంటే ఈ సామాజిక వర్గాలపై సీఎం జగన్‌కు ఎంత ప్రేమ ఉందో తెలుస్తుందన్నారు. బీసీల అభ్యున్నతికి గత టీడీపీ హయాంలో బడ్జెట్‌లో 16వేల కోట్లు కేటాయిస్తే.. 82 వేల కోట్లు వైసీపీ హయాంలో కేటాయించామన్నారు. రూ.1.60 వేల కోట్లు వివిధ సంక్షేమ పథకాల రూపంలో బీసీలకు ఇచ్చామన్నారు. గడిచిన నాలుగేళ్లలో వైసీపీ బీసీలకు చేసిన మంచి ఇది. ఇక ఇది వాస్తవం కాదు, ఇది తప్పు అని చెప్పే దమ్ము టీడీపీకి, నారా లోకేష్‌కు ఉందా అని ఎంపీ మోపిదేవి ప్రశ్నించారు.

# గ్రామాల అభివృద్ధి కై సర్పంచుల శంఖారావం


ఆంధ్ర ప్రగతి అమరావతి జూలై 28:
ఆగస్టు రెండో తేదీన ఆంధ్రప్రదేశ్ సర్పంచ్ సంఘం, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ ల ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా కమిటీల వైయస్సార్సీపి, టిడిపి, జనసేన, బిజెపి, సిపిఐ, సీపీఎం మొదలగు అన్ని పార్టీలకు చెందిన 100 మంది సర్పంచులు " చలో ఢిల్లీ " కార్యక్రమం చేపట్టి ఢిల్లీ వెళుృచున్నాము.

ఈ సందర్భంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిని, కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రిని,కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి గారిని, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి మొదలగు కేంద్ర ప్రభుత్వ పెద్దలను అధికారులను కలిసి రాష్ట్రంలోని గ్రామీణ ప్రజల, పంచాయితీల, సర్పంచుల, దుస్థితిపై మెమోరాండం సమర్పించనున్నాము.

కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక సంఘం నిధులు రూ,,8660 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు ఇవ్వకుండా,దొంగిలించి, దారి మళ్లించి తన సొంత పథకాలకు, సొంత అవసరాలకు వాడి వేసుకున్న విషయం పైన మరియు 2022-23 సంవత్సరమునకు చెందిన 2010 కోట్లు, 2023 -24 సంవత్సరము కు చెందిన 2035 కోట్లు, మొత్తం రూ,,4045 కోట్లు ఇంకా మా పంచాయతీలకు విడుదల చేయకపోవడం గూర్చి కేంద్రానికి ఫిర్యాదు చేయుచున్నాము.

ఉపాధి హామీ చట్టం క్రింద వచ్చే నిధులు చట్టప్రకారం గ్రామ పంచాయతీలకు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం వేలకోట్ల రూపాయలను హైజాక్ చేసి తన సొంత అవసరాలకు, పథకాలకు వాడి వేసుకుంటున్న విషయం గూర్చి.

భారత రాజ్యాంగం, పంచాయతీరాజ్ చట్టాల ప్రకారం ఏర్పడిన గ్రామపంచాయతీలను, సర్పంచులను, ఎంపీటీసీలను, జెడ్పీటీసీలను ,వార్డు మెంబర్లను డమ్మీలుగా చేస్తూ వారి అధికారాలను




రాజ్యాంగేతర శక్తులైన గ్రామ వాలంటీర్లకు కట్టబెట్టడం గూర్చి, రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థకు, సర్పంచులకు, ఎంపీటీసీలకు, జప్పీటీసీలకు , వార్డు మెంబర్లకు సమాంతరమైన, పోటీ వ్యవస్థ, రాజ్యాంగేతర శక్తులుగా గ్రామ సచివాలయాలను, వాలంటీర్లను తీసుకొచ్చి పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ, సర్పంచులను,ఎంపీటీసీలను, జెడ్పీటీసీలను ఉత్సవ విగ్రహాలు లాగా చేస్తున్న సమస్య గూర్చి.

రాష్ట్రంలోని 3 కోట్ల 50 లక్షల మంది గ్రామీణ ప్రజలకు రాష్ట్రంలోని 12918 మంది గ్రామ సర్పంచులు కనీసం త్రాగునీరు కూడా అందించలేని దుస్థితి, "జల జీవన్ మిషన్" పథకాన్ని కూడా మూలనపడేసిన దారుణం గూర్చి, ఇంకా మొదలగు అనేక సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం సర్పంచ్ ల పై చేస్తున్న అరాచకాల గూర్చి ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేయుచున్నాము.

కేంద్ర ఆర్థిక సంఘం నిధులు రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వకుండా నేరుగా మా గ్రామపంచాయతీ పి.ఎఫ్.ఎం.ఎస్ అకౌంట్లోనే జమ చేయాలని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం దొంగిలించిన రూ,,8660 కోట్ల నిధుల పైన సైబర్ క్రైమ్ కేసు కట్టి, సిబిఐ చేత ఎంక్వయిరీ చేయించి మా నిధులు మాకు వెంటనే ఇప్పించాలని, రాజ్యాంగేతర వ్యవస్థలైన "గ్రామ సచివాలయాలను, వాలంటీర్లను" రాజ్యాంగం ప్రకారం మా గ్రామ పంచాయతీల్లో విలీనం చేయాలని, నరేగా నిధులు కూడా నేరుగా మా గ్రామపంచాయతీలకే పి.ఎఫ్.ఎం.ఎస్ అకౌంట్లో జమ చేయాలని మొదలగు అంశాలను, డిమాండ్లను లిఖితపూర్వకంగా కేంద్ర ప్రభుత్వానికి మా సర్పంచుల సంఘం, పంచాయతీరాజ్ ఛాంబర్ నాయకులం సమర్పించనున్నాము.

అంతేకాకుండా మా న్యాయబద్ధమైన 16డిమాండ్ల పరిష్కారం కోసం గత రెండు సంవత్సరాలుగా మా సర్పంచ్ ల సంఘం ,పంచాయతీ రాజ్ ఛాంబర్ లు రాష్ట్రవ్యాప్తంగా భారీ ఎత్తున ఉద్యమాలు చేస్తూ వివిధ ఆందోళనా కార్యక్రమాలు చేస్తూ వివిధ నిరసన కార్యక్రమాలు చేపట్టినా రాష్ట్ర ప్రభుత్వం ఆ 16 సమస్యలపై స్పందించకపోవడం పైన కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తాము మరియు సర్పంచుల న్యాయబద్ధమైన రాజ్యాంగబద్ధమైన ఆ 16 డిమాండ్లు సర్పంచుల వ్యక్తిగతమైనవి కావు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మూడు కోట్ల 50 లక్షల మంది గ్రామీణ ప్రజలవే .ఆ 16 డిమాండ్లను తక్షణమే పరిష్కరించమని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించమని కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేయనున్నాము.2 -8 - 2023 నుంచి 5 - 8 - 2023 వరకు ఢిల్లీలోనే ఉండి అందరు నాయకులను కలిసి పంచాయతీలపై, సర్పంచుల పై రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశత్వాన్ని సాక్షాధారాలతో సహా వివరించనున్నాము. ఢిల్లీ వెళ్లే సర్పంచ్ లలో వైఎస్ఆర్సిపి, టిడిపి, జనసేన, బిజెపి, సిపిఐ, సీపీఎం మొదలగు అన్ని పార్టీలకు చెందిన 100 మంది ప్రతినిధులు ఉన్నారు



# పాఠశాలకు రహదారి ఏర్పాటు చేయాలంటూ విద్యార్థుల ధర్నా.



ఆంధ్ర ప్రగతి ప్రకాశం జిల్లా జూలై 28:
ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలం మద్దలకట్టలో విద్యార్థులు ధర్నా నిర్వహించారు. చాట్లమడ గ్రామానికి చెందిన విద్యార్థులు జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా చేశారు. తాము పాఠశాలకు వెళ్లేందుకు రహదారి కూడా సరిగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు తెలిపారు. చాట్లమడ గ్రామం నుంచి నిత్యం సుమారు 60 మంది వరకు మద్దలకట్ట లోని ప్రభుత్వ పాఠశాలకు వెళతారు. వారు వెళ్లేందుకు కనీసం రహదారి కూడా సరిగ్గా లేక అష్ట కష్టాలు పడుతూ పాఠశాలకు వెళ్లాల్సి వస్తుంది. వర్షాకాలం వస్తే రహదారి మొత్తం బురద మయంగా మారి సైకిళ్ళు కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో పాఠశాల మనుకోవాల్సి వస్తుందని విద్యార్థులు వాపోతున్నారు. స్థానిక మంత్రి ఆదిమూలపు సురేష్ దృష్టికి పలుమార్లు ఈ సమస్యను తీసుకెళ్లినా పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదని స్థానికులు తెలిపారు.

# జిల్లా వైద్య శాఖ అధికారి కార్యాలయంలో అవినీతి చేపను పట్టుకున్న ఏసీబీ.




ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 28:
నంద్యాల ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలోని డి.ఎం.హెచ్.ఓ. కార్యాలయంలో గతంలో డ్రైవర్ గా పనిచేసిన ఆంజనేయులు కు సంభందించిన బిల్లు 5 లక్షలు మంజూరు చేయడానికి కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ 6 వేలు లంచం అడగడంతో జగనన్నకు చెబుదాం కాల్ సెంటర్ కు ఫోన్ చేసి అక్కడే పనిచేస్తూ రిటైర్ అయ్యి తనకు రావలసిన బిల్లుకు 6 వేలు లంచం అడగడంతో ఎసిబి నీ ఆశ్రయించినట్లు బాధితుడు పేర్కొంటున్నారు.ఈ రోజు సాయంత్రం కార్యాలయం లో సీనియర్ అసిస్టెంట్ కు లంచం డబ్బు 6 వేలు ఇస్తుండగా ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్ గా దాడి చేసి పట్టుకున్నారు.ఎన్నో ఏళ్లుగా నమ్మకంగా పనిచేసిన సిబ్బంది వద్దనే లంచం అడగడం ఇంత కన్నా దారుణం ఏమి ఉండదు.లంచం అడిగిన సీనియర్ అసిస్టెంట్ వేనకుండి నడిపించిన వారు సేఫ్ గా బయటపడ్డారు.నంద్యాల జిల్లా కావడం ఒక వైపు సంతోషంగా ఉన్న,మరో వైపు లంచం లేనిదే ఏ ఫైల్స్ ముందుకు సాగవని ఆరోపణలు వినిపిస్తున్నాయి.వైద్య పరంగా అన్నీ అనుమతులు వున్నా లైసెన్స్ కావాలంటే లంచం,రెన్యువల్ చేయాలన్నా లంచం ఇవ్వాల్సిందేనని అంటున్నారు కానీ ఈ విషయం బయటకు చెప్పాలంటే పరువు పోతుందని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.జిల్లా పరిధిలో ఎన్ని ప్రవేటు ఆసుపత్రులు వున్నాయి, అన్ని అనుమతులు ఉన్నాయా అన్న ప్రశ్నలకు సమాధానం వుండదు.ఆ కార్యాలయంలో కి అడుగు పెట్టలంటేనే ప్రజలు భయపడి పోతున్నారు.



# రోటరీ క్లబ్ ఆఫ్ నంద్యాల ఆధ్వర్యంలో ఉచిత చెవి ఆపరేషన్.

ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా 28:
నంద్యాలలో పట్టణంలోనీ సంజీవ్ నగర్ గేటు దగ్గర ఉన్న తిరుమల పునీత్ %జుచీ% హాస్పిటల్ నందు రోటరీ క్లబ్ ఆఫ్ నంద్యాల తరఫున ఉచిత చెవి ఆపరేషన్ డాక్టర్ అనిల్ చేయడం జరిగిందనీ రోటరీ క్లబ్ ఆఫ్ నంద్యాల అధ్యక్షులు దండే దస్తగిరి తెలిపారు. యల్లావత్తుల గ్రామానికి చెందిన తులసమ్మకు ఉచితంగా చెవి ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించామని డాక్టర్ అనిల్ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ అనిల్ ను రోటరీ క్లబ్ ఆఫ్ నంద్యాల సభ్యులు అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఎన్నీ మోహన్ రెడ్డి, సెక్రటరీ సుధా ప్రసాద్ రెడ్డి, కోశాధికారి బాలకృష్ణ పాల్గొనడం జరిగింది.



ఆంధ్ర ప్రగతి
తెలుగు దినపత్రిక
శనివారం। 29। జూలై ।2023




# రాజకీయం అంటే వ్యాపారాలు చేయడం కాదని తెలుసుకో టీజీ.

## -ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్.

ఆంధ్ర ప్రగతి కర్నూలు జూలై 28:
ఏపిలో ఎన్నికలు దగ్గర పడుతున్నాయని ప్రతిపక్ష పార్టీ నేతల కుట్రలు పన్నుతున్నారని కర్నూలు ఎమ్మెల్యే హాఫిజ్ ఖాన్ మండిపడ్డారు. చంద్రబాబు నాయుడు ఇచ్చిన స్క్రిప్ట్ ప్రకారం జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన ఏ హామీ అమలు చేయలేదని, పేద వర్గాల కోసం సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తున్నారన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి పాలన ను తలపించే విధంగా మరోసారి సంక్షేమ పాలనను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాలకు మేలు చేసిన ప్రభుత్వం వైస్సార్ సీపీ ది అని చెప్పారు. కర్నూలు జిల్లాలో మరోసారి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హ్యాట్రిక్ విజయం సాధిస్తుందన్నారు. తెలుగు దేశం పార్టీ నేత టీజీ భరత్ అనవసర వ్యాఖ్యలు మానుకోవాలని సూచించారు. కరోనా సమయంలో కర్నూలుకు చెందిన డాక్టర్ ఇస్మాయిల్ చనిపోతే టీజీ వెంకటేష్ కుటుంబం చూడడానికి రాలేదని విమర్శించారు. కరోనా సమయంలో టీజీ వెంకటేష్ ఫ్యామిలీ ఇంట్లో నే కూర్చుకున్నారని, ప్రజలను మరిచారన్నారు. కానీ, మేము రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయాలతో పేద ప్రజలకు సేవలు అందించామన్నారు. టీజీ భరత్ పారిశ్రామికవేత్త కానీ ప్రజానాయకుడు కాలేదన్నారు. వ్యాపారాల్ని కాపాడుకునేందుకు టీజీ వెంకటేష్ బిజేపి, టీజీ భరత్ తెలుగు దేశం పార్టీలో వున్నారని విమర్శించారు

# పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటండి.

## -జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలానీ సమూన్.



ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూలై 28:
పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలానీ సమూన్ పిలుపునిచ్చారు. వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయ ఆవరణలో జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలానీ సమూన్, కలెక్టర్ గారి సతీమణి శ్రీమతి తమీమ్ అన్సారియాలు మొక్కలు నాటి నీళ్లు పోసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలానీ సమూన్ మాట్లాడుతూ వాతావరణ సమతుల్యత, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. జిల్లా అంతటా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పచ్చదనం పెంపొందించేందుకు ఖాళీ ప్రదేశాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని సోషల్ ఫారెస్ట్ అధికారులను కలెక్టర్ సూచించారు. పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని, ఇందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. మొక్కల పెంపకాన్ని ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలన్నారు. పచ్చదనం పెరిగినప్పుడే గాలిలో ఆక్సిజన్ పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పిడి రామచంద్ర రెడ్డి, జిల్లా ఉద్యాన శాఖాధికారి నాగరాజు, డిఎఫ్ఓ ఎన్డికె ప్రసాద్, ఎంపీడీవో సుగుణ తదితరులు పాల్గొన్నారు.

# కుందూనది కాలుష్య నివారణ కోసం ఆమరణ దీక్షలు చేపడతాం.



ఆంధ్ర ప్రగతి కోవెలకుంట్ల జులై 28:
గత నాలుగు వారాల నుండి కుందూ నది లో విషవాయువులు నంద్యాల లిక్కర్ ఫ్యాక్టరీ మరియు ఆగ్రో ఫ్యాక్టరీ నుండి వెలువడిన విషయం అందరికి తెలిసిందే. అందులో భాగంగా ఈరోజు మళ్ళీ కుందూ నది లో విషవాయులు కలవడం తో మరిన్ని చేపలు ఉయ్యాలవాడ మండలం కుందూ నది తీర ప్రాంతం లో లక్షలది చేపలు చనిపోవడం చాలా బాధాకరం అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా నంద్యాల జిల్లా కలెక్టర్ మరియు బనగానపల్లె నియోజకవర్గ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మరియు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి కుందూ నది లో నంద్యాల ఫ్యాక్టరీ నుండి వెలువడే వ్యర్థాలు వల్ల జరిగిన చేపల నష్టం మరియు కుందూనది తీరప్రాంతా ప్రజలు త్రాగు సాగు నీరు మరియు ఇతరత్ర అవసరాలు వున్న ఈ నీటిని పరిశ్రమలు వల్ల,వ్యర్థ పదార్థాలు వదిలి నీటిని కలుషితం చేయద్దన్ని వారు తీవ్రంగా వ్యతిరేకించడం చాలా శుభపరిణామందీనిపై ప్రజా సంఘాల వినతిమేరకు
జిల్లా కలెక్టర్ స్పందించి ఒక విచారణ కమిటీ వేయడంఆ విచారణ కమిటీ పరిశ్రమలు వల్లే ఈ వ్యర్థాలు కలిసాయని ఆ రిపోర్ట్ తీస్కొని పై కమిటీ కి చర్యలు తీసుకోవాలని ఆదేశాలివ్వడం శుభపరిణామం అని నేతలు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్ లో కుందూ నది దీర్ఘాకాళిక సమస్యల పై పోరాడటానికి సిద్ధంగా ఉందని కుందూనది పరిరక్షణ సమితి అధికారులు కు హెచ్చరికలు జారిజేశారు. ఈ కార్యక్రమం లో గురప్ప, అమర్ నాథ్ రెడ్డి, దేవరాజు, రాజు,సీతారామయ్య, సాయి, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల పట్ల అప్రమత్తంగా ఉండండి.

## -జిల్లా కలెక్టర్లను సూచించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.



ఆంధ్ర ప్రగతి నంద్యాల, జులై 28:
రాష్ట్రంలో భారీ వర్షాలు, నదుల్లో వరద ప్రవాహాల పట్ల అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు జాగ్రత్త చర్యలు చేపట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లను సూచించారు. శుక్రవారం మధ్యాహ్నం రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై అన్ని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో తాడేపల్లి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్, జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి, డిఆర్ఓ పుల్లయ్య తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రముఖ్యమంత్రి మాట్లాడుతూ వరద ప్రాంతాల్లో పర్యటించాలని, ముంపు ప్రాంతాలు, పంటపొలాలను సందర్శించి బాధితులకు అండగా నిలవాలని ఆదేశించారు. మానవత్వంతో ముమ్మరంగా సహాయ కార్యక్రమాలు చేయండి. లోతట్టు, మునక ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు, సహాయ శిబిరాలకు తరలించేందుకు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సహాయ శిబిరాలలో అన్ని వసతులు కల్పించాలన్నారు. జిల్లాల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండల స్థాయి, సచివాలయం స్థాయిలో కూడా సమాచారం సేకరణ ఉండాలి. వాలంటీర్లను అప్రమత్తం చేయండి. మునక ప్రాంతాలు, వరద ప్రభావిత ప్రాంతంలో నీటి దిగ్బంధనంలో ఉన్న ప్రజలకు 25కేజీల బియ్యం, కందిపప్పు, ఆయిల్, ఎర్రగడ్డ, ఉర్లగడ్డలు తదితర రేషన్ అందించండి. ఇందుకు ఎం ఎల్ ఎస్ స్టాక్ పాయింట్లు, ఎఫ్ పి షాపులలో రేషన్ సరుకులు సిద్ధంగా ఉంచుకోవాలి. త్రాగునీటి ప్యాకెట్లు పంపిణీ కొరకు ఏర్పాటు చేసుకోవాలి. వరద ప్రాంతాల్లో నీరు తగ్గి సహాయ శిబిరాల నుంచి ఇళ్లకు పంపేటపుడు కుటుంబానికి రూ. 2వేలు, ఒక్కరే ఉంటే రూ.1000లు ఇవ్వాలి. సహాయ కార్యక్రమాలు, పరిహారం పంపిణీలో పారదర్శకంగా మానవత్వంతో ఉండాలి. ఎక్కడ కూడా సహాయం అందలేదని ప్రభుత్వానికి మాట రాకూడదు. వర్ష గ్రామాల్లో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టి అన్నిచోట్లా బ్లీచింగ్ చేయండి. హెల్త్ క్యాంప్స్ చేయాలి. సిహెచ్సి, పీహెచ్సి లు, విలేజ్ హెల్త్ క్లినిక్స్ లలో మందులు స్టాక్ ఉంచుకోవాలి. వర్షాలకు పాములు వస్తాయి... యాంటీ డోస్ మందులు సిద్ధంగా ఉంచుకోవాలి. మునక ప్రాంతాలలో వరద నీటి ప్రభావం తగ్గాక దెబ్బతిన్న పాకలు, గుడిసెలు, గృహాలు తదితర ఆస్తి నష్టం వివరాల అంచనా నివేదికల సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ జిల్లాలో భారీ వర్షాల వల్ల చెరువులు, వాగులు, వంకల పరీవాహక ఆర్ అండ్ బి రహదారుల్లో నీటి ప్రవాహాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్ అండ్ బి ఎస్ఈని ఆదేశించారు. త్రాగునీటి పైపు లైన్లు, రక్షిత మంచినీటి పథకాల్లో నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈని కలెక్టర్ ఆదేశించారు. వర్షాల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ సమస్యలు ఎత్తకుండా తలెత్తకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని డిపిఓ ను ఆదేశించారు. జల వనరులు, మైనర్ ఇరిగేషన్ శాఖలు నదుల్లోని నీటి నిల్వలు, పై ప్రాంతాల నుండి వస్తున్న వరద ప్రవాహాలను ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరిస్తూ అప్రమత్తం చేయాలని ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వర్షాలు, వాగులు పొంగే ప్రవాహాలపై అధికారులంతా అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు సహాయక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కమ్యూనికేషన్ గ్యాప్ లేకుండా అధికారులందరూ సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టేలా సిద్ధంగా ఉండాలని కలెక్టర్ సూచించారు.

# ప్రభుత్వం నుండి అనుమతి పొందిన ఎరువులు పురుగు మందులను మాత్రమే అమ్మాలి.



ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 28:
ప్రభుత్వం నుండి అనుమతి పొందిన ఎరువులు మరియు పురుగుమందులు మాత్రమే దుకాణదారులు రైతులకు అమ్మాలని నంద్యాల మండలం వ్యవసాయ అధికారి ప్రసాదరావు తెలిపారు. జిల్లా కలెక్టర్ మణిజీర్ జిల్లాని సామాన్ ఆదేశాల మేరకు జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు సూచనలతో ఎరువుల మరియు పురుగు మందుల దుకాణాల తనిఖీ లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ తనిఖీ లలో భాగంగా మండల వ్యవసాయ అధికారిప్రసాద రావు, గత సోమ వారము నుండి శుక్రవారము వరకు నంద్యాల లోని ఎరువుల మరియు పురుగు మందుల దుకాణాలు అయిన భారత్ పెస్ట్ కెం ప్రైవేట్ లిమిటెడ్, మిరియాల ఎల్లయ్య, బైసాని ట్రేడర్స్, %చీ% రెడ్డి ఆగ్రో ఏజెన్సీస్, %ూా=% ట్రేడర్స్ , న్యూ విజేత ఏజెన్సీస్ మరియు భాను శ్రీ ఆగ్రో ఏజెన్సీస్ లలో తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా న్యూ విజేత ఏజెన్సీస్ లలో 49725/- రూపాయల మరియు భారత్ పెస్ట్ కెమ్ ప్రైవేట్ లిమిటెడ్ లో 84,560/- రూపాయల బయో స్టిములెంట్స్ మరియు పురుగు మందులను సరైన అనుమతులు లేని కారణంగా నిలుపుదల చేసాము. నంద్యాల మండలములోని ప్రతి ఎరువుల మరియు పురుగు మందుల యాజమానులు ప్రభుత్వం ( వ్యవసాయ శాఖ)నుండి అనుమతులు వున్న ఎరువులు మరియు పురుగు మందులు మాత్రమే అమ్మాలని, స్టాక్ బోర్డ్ ప్రతి రోజూ అప్డేట్ చేయాలని, ఎరువులు మరియు పురుగు మందులు కొన్న ప్రతి రైతు కి బిల్లు కచ్చితంగా ఇవ్వాలని తెలియజేశారు. ప్రతి ఎరువుల ధుఖాన యాజమానులు తప్పని సరిగా %×ఖీమీ% మెషీన్ లో మరియు ఫిజికల్ స్టాక్ రిజిస్టర్ స్టాక్ లు సమానంగా వుండాలని, అలాగే ఎరువులు కృత్రిమ కొరత సృష్టించి గరిష్ట చిల్లర ధర కన్నా ఎవరైనా ఎక్కువగా అమ్మితే వారిపై %ఖీజూ% 1985 చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు తెలిపారు.

# మహిళకు ఉచితంగా ఆపరేషన్ చేసిన తిరుమల పునీత్ వైద్యులు అనిల్ కుమార్

ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 28:
ప్రతి వైద్యుడు భగవంతునితో సమానం అన్న నినాదానికి నిదర్శనం నంద్యాల తిరుమల పునీత్ హాస్పిటల్ వైద్యులు అనిల్ కుమార్ నిదర్శనం. వివరాల్లోకి వెళితే వెంగళరెడ్డి పేట గ్రామానికి గ్రామానికి చెందిన తులసమ్మ చాలా సంవత్సరం నుండి చెవి సమస్యతో బాధపడుతు చెవుడుతో బాధపడుతూ ఉన్నది. ఆర్థిక సమస్యలతో ఆపరేషన్ చేయించుకోలేక అలాగే ఉండిపోయింది. ఈ విషయాన్ని వెంగళరెడ్డిపేట గ్రామ సర్పంచ్ పల్లె నాగమణి పల్లె సోమశేఖర్ రెడ్డి నేటి వార్త జిల్లా ఇంచార్జ్ ఇస్మాయిల్ దృష్టికి తీసుకొని రాగా వెంటనే ఈ సమస్యను తిరుమల పునీత్ వైద్యులు అనిల్ కుమార్ కు తెలియజేయగా వెంటనే ఆమెకు ఉచితంగా ఆపరేషన్ చేస్తానని తెలియజేశారు. ఒక నెల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసి శుక్రవారం బాధితురాలు తులసమ్మకు ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా నేటి వార్త జిల్లా ఇన్చార్జి ఇస్మాయిల్ బాధితురాలు తులసమ్మ కుటుంబ సభ్యులు తిరుమల పునీత్ వైద్యులను కలిసి ఘనంగా సత్కరించి మెమెంటో అందజేశారు . అంతేకాకుండా ప్రజా సేవలో భాగంగా ఒక రిపోర్టర్ ఒక పేద మహిళ సమస్యను తమ దృష్టికి తీసుకుని వచ్చి సేవ చేసిన నేటి వార్త జిల్లా ఇన్చార్జి ఇస్మాయిల్ ను వైద్యులు అనిల్ కుమార్ కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మదర్ యూత్ సభ్యులు మురళి హుస్సేన్ భాష మద్దిలేటి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# విద్యాశాఖకే మాయని మచ్చ ఈ ప్రకటన.



ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 28:
ఇటీవల భారీ వర్షాల కారణంగా సెలవుల గురించి నంద్యాల జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం నుండి వెలువడిన 26.07.2023 నాటి పత్రికా ప్రకటన చూస్తే, విద్యాశాఖకే మచ్చ తెచ్చేలా ఉందని, ప్రజల్లో విద్యాశాఖ పట్ల చులకన భావం ఉత్పన్నం అయ్యిందని, ఒక ఉపాధ్యాయుడిగా తీవ్ర ఆవేదన కలిగిందని బహుజన టీచర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక జిల్లా అధ్యక్షులు కె. సతీష్ కుమార్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. డీఈఓ కార్యాలయంలో పత్రికా ప్రకటన సంభందిత క్లర్క్ టైప్ చేసిన తరువాత సూపరింటెండెంట్, ఎడి పరిశీలించిన తరువాత డీఈఓ సంతకం కొరకు పంపుతారు. ఇందులో ఏ ఒక్కరు కూడా శ్రద్ధ తీసుకోకపోవడం వల్ల ప్రభుత్వ విద్యావ్యవస్థకే కళంకం ఏర్పడిందని అన్నారు.

డీఈఓ కార్యాలయ సిబ్బంది చేసిన తప్పులకు ఉపాధ్యాయులపై కూడా ప్రజలందరూ యథా రాజా, తథా ప్రజా అంటూ హేళన చేస్తున్నారని మండిపడ్డారు.

ఈ అంశంలో తక్షణమే రాష్ట్ర ఉన్నతాధికారులు స్పందించి బాద్యులను గుర్తించి, తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

# పూలుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత.

## -చలమ రేంజ్ ఆఫీసర్ ఈశ్వరయ్య



ఆంధ్ర ప్రగతి మహానంది జూలై 28:పూలుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని చలమ రేంజ్ ఆఫీసర్ ఈశ్వరయ్య అన్నారు. శుక్రవారం మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని ఒకటవ సచివాలయంలో అంతర్జాతీయ పులుల దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైసిపి నాయకులు కొండా మధుసూదన్ రెడ్డి, గాజులపల్లె పిహెచ్సి డాక్టర్ వెంకటరెడ్డి, ఎంపీటీసీ చౌటిపల్లె నరసింహులు హాజరయ్యారు. సందర్భంగా రేంజర్ ఈశ్వరయ్య పులుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ జీవ సమతుల్యత పై అవగాహన కల్పించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కొండా మధుసూదన్ రెడ్డి, పి హెచ్ సి వైద్యులు డాక్టర్ వెంకటరెడ్డి,అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రాజకీయ నిరంకుశం ఎప్పటికీ ప్రమాదమే

## అధికారంలో ఉన్నప్పుడే సర్దుకోవాలి - లేకుంటే ప్రజాగ్రహంలో కొట్టుకు పోక తప్పదు

న్యూఢిల్లీ,జూలై28 :
అధికారం శాశ్వతమని ఏ రాజకీయ పార్టీ అయినా అనుకుంటే పొరపాటు. వివిధ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీలు ఆర్థిక క్రమశిక్షణతో పాటు,రాజకీయ క్రమశిక్షణ కూడా పాటించకుంటే మట్టికరచి పోతాయని గతంలో అనేక సందర్భాల్లో చూశాం. ఎన్టీఆర్ లాంటి వారు కూడా ప్రజాగ్రహంలో కొట్టుకు పోయారు. ఎపిలో జగన్ ప్రభుత్వం విపక్షాలను అణచివేయడం, కేసులు పెట్టడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. తాను పుట్టి పెరిగిన పార్టీలను అణగ దొక్కడంలో కెసిఆర్ ఎలాంటి వెనకడుగు వేయలేదని రాష్ట్ర రాజకీయాలను చూస్తే అర్థం చేసుకోవచ్చు. కాంగ్రెస్, టిడిపిలు తెలంగాణలో ఉనికి లేకుండా పోవాలని కెసిఆర్ వేసిన ఎత్తుగడలు ఫలించాయి. ఆయన దెబ్బకు టిడిపి ఉనికిలేకుండా పోయింది. బెంగాల్లో కమ్యూనిస్టులు ఇదే ధోరణిలో 30ఏళ్లపాటు రాజ్యమేలారు. తమకు తిరుగు లేదన్న ధోరణిలో వారు ప్రజల ఆశలను, ఆకాంక్షలను పట్టించు కోలేదు. తమ నిరంకుశ పాలనకు ప్రజాస్వామ్యం, అభివృద్ధి ముసుగేసారు. కానీ అక్కడా మమతా బెనర్జీ లాంటి వారు పుట్టుకుని వచ్చారు. కమ్యూనిస్టులను కూకటి వేళ్లతో పెకిలించారు. అయితే ఆమె కూడా అదే ధోరణిలో నిరంకుశ పాలన సాగించడంతో ఇప్పుడు మమతా బెనర్జీ పునాదులు కూడా కదులుతున్నాయి. ఇక తెలంగాణలో కూడా తొలుత తెలుగుదేశం పార్టీని, ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీని కోలుకోకుండా దెబ్బతీసిన కేసీఆర్, ఇప్పుడు బీజేపీ,కాంగ్రెస్‌లను ఎదుర్కో వాల్సి వస్తుందిన ఊహించి ఉండక పోవచ్చు. పశ్చిమ బెంగాల్‌లో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఏ తప్పు చేశారో తెలంగాణలో కూడా కేసీఆర్ అదే తప్పు చేస్తున్నారు. విపక్షాలు పుంజుకోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. ఓ రకంగా అది కెసిఆర్ వైఫల్యంగానే చూడాలి. ప్రజల్లో నిరసనలు నివురుగప్పితే నాయకుడ నేవాడు ఏ పార్టీలో అయినా పుట్టుకుని వస్తారని గమనించాలి. ఈ కారణంగా కేసీఆర్‌కు ప్రత్యామ్నాయం కావాలనుకున్న వారికి ఇప్పుడు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కనిపిస్తున్నాయి. అప్పుల కుప్ప చేసి పథకాలను ప్రకటించి ప్రజలను ఓట్ల రూపంలో మలచుకోవడంలో అధికార పార్టీ నేతలు ఆరితేరారు. దీంతో రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకు పోతున్నాయి. ఈ అప్పులు ఇప్పుడు తీర్చే శక్తి కూడా రాష్ట్రాలకు లేకుండా పోతున్నది. అందుకే ఆర్థిక క్రమశిక్షణ పాటించాలి. కెసిఆర్ లేదా జగన్ తన ఇష్టం వచ్చినట్లుగా ముందుకు సాగుతూ ప్రజలను విశ్వాసంలోకి తీసుకోకుండా, కేవలం తన సొంత నిర్ణయాలతో మభ్యపెట్టే ప్రయత్నాలు మంచివికావని తెలుసుకోలేక పోతున్నారు. చిన్నిచిన్న సమస్యలను కూడా తృణీకరించడం సరికాదు. వరదలు వస్తే గట్టిగా వారి పక్షాన నిలబడి ఆదుకునే ప్రయత్నాలు సాగడం లేదు. అన్నింటికీ మసిపూసి మారేడుకాయ చేసే ప్రయత్నాలు మంచిది కాదు. ప్రజల్లో గూడు కట్టుకుంటున్న అసంతృప్తిని పసిగట్టడంలో ఇద్దరు నేతలు విఫలమవుతున్నారు. బిఆర్ఎస్ పార్టీలో ప్రజాస్వామ్యాన్ని మచ్చుకు కూడా కనిపించకుండా అంతా తామే అన్నట్టుగా కెసిఆర్, కెటిఆర్ వ్యవహారాలు నడుపుతున్నారు. ప్రగతిభవన్ ఛాయలకు ఎవరు రాకుండా చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు,ఎంపిలకు కూడా పర్మిషన్ ఉండాల్సిందే. అధికారం అంతా ఒక కుటుంబం వద్దనే కేంద్రీకృతమై ఉందన్న ఆరోపణలు పెరిగాయి. క్షేత్రస్థాయిలో ప్రజల మనోభావాలను తెలుసుకునే ప్రయత్నం చేయకుండా మీడియాను దూరం పెట్టారు. కేసీఆర్, జగగన్‌లు చిన్నపాటి విమర్శలను కూడా స్వీకరించలేని స్థితికి చేరుకున్నారు. ఫలితంగా ప్రజల మనోభావాలను తెలియ జేయడానికి పార్టీలో కూడా ఎవరూ సాహసించలేని పరిస్థితి ఏర్పడింది. యధారాజా తథా ప్రజా అన్నట్లు పాలకుల నియంతృత్వానికి అలవాటు పడిన మంత్రులు, శాసన సభ్యులు, ఇతర నాయకులు తమ ఇలాకాల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరించడం మొదలెట్టారు. ప్రజాస్వామ్యంలో నిరంకుశ విధానాలను ఎవరు అవలంబించినా పతనం తప్పదు. అది గుర్తించకపోతే మనుగడ సాగించడం కూడా అంతే కష్టం. ప్రజల మనసెరిగి ముందుకు సాగితే ఎంతకాలమైనా ప్రజలు ఆదరిస్తారు. అందుకు ఒడిషా సిఎం నవీన్ పట్నాయక్ ఉదాహరణగా చూడాలి. అందుకే రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడానికి అనుసరించాల్సిన వ్యూహాలపై ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టి సారిస్తే..ఆయనను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్, బిజెపిలు ప్రతివ్యూహాలు పన్నుతున్నాయి. గత ఎన్నికల్లో చంద్రబాబు బూచిని చూపించి సునాయాసంగా విజయాన్ని అందుకున్న కేసీఆర్ ఇప్పుడు బూచి చూపడానికి లేదు. జగన్ చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లను ఎదుర్కోక తప్పదు.

# కాలేయ వ్యాధులకు దూరంగా ఉండాలి

## - ప్రపంచ హెపటైటిస్ దినోత్సవ లక్ష్యం అదే

హైదరాబాద్,జూలై28 ):
ప్రస్తుతం కాలంలో ఉన్న పరిస్థితులు, ఆహారపు అలవాట్లు, జీవన విధానాలు, ఉద్యోగంలో ఒత్తిళు ,, మానసిక ఒత్తిళ్లు, నిద్రలేనితనం తదితర కారణాలతో మనిషి ఎన్నో వ్యాధుల బారిన పడుతున్నాడు. ఇందులో హెపటైటీస్ వ్యాధి. ఇది చాలా ప్రమాదకరమైనది. ఇది శరీరంలోని కాలేయం (లివర్)పై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఏ,బి,సి,డి,ఇలు వెలుగు చూసిన ఈ వ్యాధిలో హెపటైటీస్ వ్యాధి చాలా ప్రమాదకరమైనదని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ వ్యాధి తీవ్రత సిర్రోలిక్ దశకు చేరుకుని ఏకంగా కాలేయం పూర్తిగా దెబ్బతింటుంది. ఈ దశలోకాలేయం మార్పిడి చేయాల్సి వస్తుంది. అందుకు వ్యాధి బారినపడకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలి. అలాగే ఈ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.అయితే 2011లో జూలై 28వ తేదీని ప్రపంచ కాలేయ వ్యాధి (హెపటైటిస్) దినోత్సవాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించి ఈ రోజున సదస్సులు నిర్వహించడం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని నిర్ణయించింది. దీంతో ప్రతియేటా జూలై 28న ప్రపంచ కాలేయ వ్యాధి దినోత్సవాన్ని జరుపుకొంటున్నాము. హెపటైటిస్ బీ వైరస్ను కనుగొన్న నోబెల్ గ్రహీత బరూచ్ శామ్యూల్ బ్లంబర్గ్ కు గుర్తుగా ఆయన పుట్టిన రోజు సందర్భంగా ఈ రోజును ఏర్పాటు చేశారు.కాలేయ వ్యాధి ఎక్కువగా ఎవరికి వస్తుంది. ఈ వ్యాధి అధికంగా మద్యం సేవించే వారికి వస్తున్నట్లు తెలుస్తోంది. శరీరంలో చేరే మద్యాన్ని విసర్జించే క్రమంలో కాలేయం ఎక్కువగా శ్రమకు గురవుతుంది. కాలేయం సామర్థ్యానికి మించి మద్యం సేవించినట్లయితే కాలేయ మెల్లమెల్లగా దెబ్బతింటుంది. ఫలితంగా ఆల్కహాలిక్ ఫ్యాటీలివర్ డిసీజ్, ఆల్కహాలిక్ హెపటైటీస్ ఆల్కహాలిక్ సిర్రోసిస్ వ్యాధులు దరిచేరుతాయి. ఆల్కహాలిక్ ఫ్యాటి లివర్ డిసీజ్‌లో కాలేయం కణాల్లో కొవ్వు పేరుకుపోతుంది. అలాగే కాలేయం పనితీరు సక్రమంగా ఉన్నా.. ఎంజైమ్ విడుదలలో హెచ్చు తగ్గులు చోటు చేసుకుంటాయి.ఈ పరిస్థితిని మద్యం మానేసి సరిదిద్దుకోవాలి. అతిగా మద్యం సేవించే వారి కాలేయం వాపునకు గురై గట్టిగా తయారవుతుంది. దీనినే ఆల్కహాలిక్ హెపటైటీస్ అంటారు.ఈ వ్యాధితో కాలేయం పనితీరు క్రమంగా అదుపు తప్పుతుంది. వ్యాధి తీవ్రత పెరిగితే కాలేయం విఫలమవుతుంది. హెపటైటిస్ బి, హెపటైటిస్ సి, వైరస్‌ల వల్ల కాలేయం కేన్సర్‌కు దారి తీసే అవకాశం ఎక్కువగా ఉంటుంది..లివర్ క్యాన్సర్ ముప్పుహెపటైటిస్ ఇన్‌ఫెక్షన్ లివర్ క్యాన్సర్‌కు కూడా దారి తీసే అవకాశం ఉంది. సాధారణ కాలేయ క్యాన్సర్‌ను హెపటో సెల్యూలార్ క్యాన్సర్ అని అంటారు. దీర్ఘకాలికంగా ఆల్కహాల్ తీసుకునే వారికి ఈ వ్యాధి ఏర్పడుతుంది. దీన్ని కడుపు పైభాగంలో నొప్పితో పాటు బరువు తగ్గడం వంటి లక్షణాలతో గుర్తించవచ్చు. పసిరికలు, నీళ్ల విరేచనాలు వంటి లక్షణాలు కూడా కనిపిస్తుంటాయి. ప్రాథమికంగా రక్తపరీక్ష (ఏఎఫ్‌బీ), అల్ట్రా సౌండ్ పరీక్షలతో గుర్తించవచ్చు. అవసరాన్ని బట్టి సీటీ స్కాన్, ఎండోస్కోపీ, బయాప్సీ పరీక్షలు చేయించాల్సి ఉంటుంది.'వన్ లైఫ్, వన్ లివర్'.ఈ సంవత్సరం 2023, ప్రపంచ హెపటైటిస్ డే థీమ్ ' వన్ లైఫ్, వన్ లివర్ '. వైరల్ హెపటైటిస్ నివారణ, రోగనిర్ధారణ మరియు చికిత్సను మెరుగుపరచడానికి అవసరమైన కొలతలను వేగవంతం చేయడానికి, తద్వారా కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి మరియు ప్రపంచవ్యాప్తంగా 2030 హెపటైటిస్ నిర్మూలన లక్ష్యాలను సాధించడానికి ప్రపంచవ్యాప్తంగా కృషి చేస్తున్నారు.

# తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డి సారు మాకు న్యాయం చేయండి

## -మహిళ ఆవేదన.

-మీ పార్టీకి చెందిన శరభారెడ్డి మా భూమిని కబ్జా చేశారు.

-మీరు చొరవ తీసుకొని మా భూమిని మాకు ఇప్పించండి.


ఎమ్మెల్యే పెద్దారెడ్డి


శరభారెడ్డి


బాధితురాలు: పీట్ల లక్ష్మీదేవి

ఆంధ్ర ప్రగతి తాడిపత్రి జూలై 28:
తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డికి తమ భూమిని తమకు ఇప్పించాలని ఒక మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే అనంతపురం జిల్లా, పెద్దవడుగూరు మండలం, వెంకటాంపల్లి గ్రామానికి చెందిన పీట్ల లక్ష్మీదేవి సర్వేనెంబర్ 155 నందు 10.09 ఎకరాముల భూమి ఉన్నది. దీనిని మేము గత 20 సంవత్సరములుగా సాగు చేసుకుంటున్నాము. అదేవిధంగా ఈ సంవత్సరం కూడా సాగు చేశాము కానీ పెద్దవడుగూరు మండలం కి చెందిన వైఎస్సార్సీపీ నాయకుడు శరభారెడ్డి మరియు బసినేపల్లి కి చెందిన తిమ్మారెడ్డి ఇద్దరు కలిసి మేము సాగు చేసిన పొలంలో ట్రాక్టర్ తో దున్ని దౌర్జన్యంగా పొలాన్ని నాశనం చేశారు. అదేవిధంగా శరభారెడ్డి ,తిమ్మారెడ్డి ఇద్దరు పోలీసు వారితో మమేకమై మా మీద తప్పుడు కేసులు బనాయించి మమ్మల్ని బెదిరిస్తున్నారు. పోలీసు వారు కూడా వారికి సహకరిస్తూ మాకు ఫోన్ చేస్తూ పోలీస్ స్టేషన్ కి రావాలని రాకపోతే మీకు కొన్ని సెక్షన్ ల కింద కేసు కట్టాల్సి ఉంటుందని చెప్పి పోలీసు వారు మమ్మల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారు.కనుక తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డి సారు మీ వైఎస్ఆర్సిపి నాయకుడైన శరభారెడ్డి మరియు తిమ్మారెడ్డి మరియు పోలీసు వారి నుంచి మాకు రక్షణ కల్పించి మా భూమిని మాకు ఇప్పించవలసిందిగా కోరుచున్నట్లు తెలియజేసిన బాధితురాలు పిట్ల లక్ష్మీదేవి.

# మోరంచలో ఎమ్మెల్యే పర్యటన

## - బాధితులకు ఆదుకుంటామని హామీ

భూపాలపల్లి,జూలై28(ఆర్ఎన్ఎ): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మోరంచపల్లి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నది. ఎడతెరపిలేకుండా కురుస్తున్న వానలతో మోరంచ వాగు ఉప్పొంగింది. దానికి గణప సముద్రం వరద తోడటంతో మోరంచ ఉగ్రరూపం దాల్చింది. దీంతో ఊరిని మొత్తం వరద చుట్టుముట్టింది. అర్ధరాత్రి వేళ ఒక్కసారిగా వరద పోటెత్తడంతో ఇండ్లు మొత్తం నీటమునిగాయి. ఇండ్లపైకి చేరుకున్న గ్రామప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని తెల్లవార్లు గడిపారు. ప్రభుత్వం రంగంలోకి దిగింది. హెలికాప్టర్లు, బోట్లతో వాగులో చిక్కుకుపోయినవారిని రక్షించారు. రోజు గడిచింది. మోరంచ వాగు శాంతించింది. జలదిగ్భందంలో చిక్కుకుని మునిగిపోయిన ఇండ్లు తేలాయి. గ్రామంలో ఎక్కడ చూసినా రోడ్లు ధ్వంసమైపోయాయి. వరద ఉధృతికి పలుచోట్ల రహదారి కొట్టుకుపోయింది. అయితే శుక్రవారం ఉదయానే భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి , జిల్లా పరిషత్ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి మోరంచపల్లికి చేరుకున్నారు. దెబ్బతిన్న రోడ్లను పరిశీలించారు. ఇంటింటికి తిరిగి పరిశీలించారు. బాధితులను పరామర్శించారు. బాధితుల క్షేమసమాచారాలు అడిగితెలుసుకున్నారు. పలువురు వరద ఉధృతిని గురించి గండ్ర దంపతులకు వివరించారు. కాగా, బాధితులకు ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## సంపాదకీయం

# ప్రతిష్టంభనతో ప్రయోజం శూన్యం !

గురువారం 28-7-2023

భారతదేశం,ప్రజాస్వామ్యం గురించి గొప్పలు చెప్పడం మనకు బాగా అలవాటయ్యింది. అయితే చట్టసభ ల్లో చర్చించకుండానే చట్టాలు వస్తున్నాయి. చట్టసభల్లోచర్చించకుండా సమస్యలను దాట వేస్తున్నారు. ఎందుకిలా చేస్తున్నామన్న ఆలోచనచేయడం లేదు. రాబోయే తరాలకు ఎలాంటి సందేశం ఇవ్వబోతున్నారో చెప్పడం లేదు. అధికార, విపక్షాలు తమ రాజకీయ ఎజెండాతో పనిచేయడం వల్లనే ఇలా జరుగుతోంది.

ఇలా ఒక్క సమస్యపైనా చర్చించకుండా కాలం గడిపేస్తున్నారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన పార్లమెంట్ అధికారంలో ఉన్న ఒకరిద్దరు నేతల కనుసన్నల్లో సాగుతున్నాయి. గత శీతాకాల సమావేశాలు ఇలాగే ముగిసాయి. ఇప్పుడు వర్షాకాల సమావేశాలు సైతం ఒక్కటంటే ఒక్క సమస్యపై చర్చించడం లేదు. ఈనెల 20న పార్లమెంట్ సమావేశాలు మొదలయ్యాయి. నేటికీ ఒక్క సమస్యపైనా చర్చలేదు. చర్చకు సిద్ధమని అధికార పక్షం చెబుతున్నా.. విపక్షాలకు మాత్రం అవకాశం ఇవ్వడం లేదు. మణిపూర్ మంటల పైనా పట్టింపు లేదు. ఎందుకిలా అన్న ఆలోచన కూడా చేయడం లేదు. ఇదేదో అధికార,విపక్షాల సమస్యగా చూస్తున్నారు. ఇక్కడ 140కోట్ల ప్రజలంతా ఆందోళన లతో ఉన్నా పట్టించుకోవం లేదు. వరదలతో దేశం మునుగుతున్నా చర్చించడం లేదు. భారతదేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం మేడిపండు చందంగా మారిందా అన్న అనుమానాలు బలపడుతున్నాయి. వ్యక్తిస్వామ్యం,నిరంకుశత్వం ప్రబలిపోతోంది. పార్లమెంట్, అసెంబ్లీల్లో ప్రజల సమస్యల పై చర్చ జరగడం లేదు. అధికార విపక్షాలు కలసి ఇదేదో తమ సొంత జాగీరుగా భావించి.. సమావేశాలను నడుపుకుంటున్నారు. అధికారంలో ఏ పార్టీ ఉన్నా ఇదే తంతు సాగుతోంది. బిజెపి అధికారం చేపట్టిన తరవాత అసలు సమస్యలపై చర్చ అన్నది మరచిపోయారు. సమస్య ఏదైనా పార్లమెంటులో చర్చకు రావడం లేదు. ఈ క్రమంలో అన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీల్లో ఇదే పద్దతి సాగు తోంది. రాష్ట్రాల్లో కూడా అధికార పార్టీ నేతలు చర్చలకు అవకాశం ఇవ్వడం లేదు. మణిపూర్ మంటలు, దేశంలో పెరుగుతున్న ధరలు, జీఎస్టీ పెంపు, వరదలు నిరుద్యోగం లాంటి అంశాలపై చర్చించి జవాబివ్వా లని ప్రతిపక్షాలు చేస్తున్న డిమాండ్‌ను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ప్రతిపక్షాలు ప్రవేశ పెడుతున్న వాయిదా తీర్మానాలను సభా పతులు బుట్టదాఖలు చేస్తున్నారు. కనీసం సభావ్యవహారాల కమిటీ సమావేశాల్లో కూడా కీలక అంశాలపై చర్చకు సమయాన్ని కేటాయించేందుకు ప్రభుత్వం మనస్ఫూర్తిగా ముందుకు రావడం లేదు. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైనప్పుడల్లా ప్రతిపక్షాలు లేవనెత్తే ప్రతి అంశంపై చర్చించడానికి తాము సిద్ధమని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రకటించడం ఆనవాయితీగా మారింది. తొలిరోజు ప్రధాని మోడీ కూడా సభ సజావుగా సాగాలని, ఈ సమావేశాలకు ప్రాధాన్యం ఉందని అంటున్నారు. అయితే పార్లమెంట్ సమావేశమైన తర్వాత అలాంటి సుహృద్భావ వాతావరణం మాత్రం కనపడడం లేదు. నిజంగా ఎందుకు ఇలా చేస్తున్నారో బిజెపి అగ్రనేతలు చెప్పాలి. ఎందరో కొత్త సభ్యులు పార్లమెంట్ గడప తొక్కారు. వారికి రూల్స్ కూడా తెలియకుండానే సమావేశాలు వాయిదా పడుతున్నాయి. ఈ తరహా జరుగుతున్న సమావేశాలతో ప్రజలకు ఏం సమాధానం చెబుతారో చెప్పాలి. పార్లమెంట్ సమావేశాలు జరిగినప్పుడల్లా అసలు పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఎక్కడుందన్న అనుమానం కలుగుతుంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమై పదిరోజులైనప్పటికీ ఒక్కరోజు కూడా పార్లమెంట్ సరిగ్గా సాగలేదు. సభలో ఈ రోజు అయినా సమస్యలపై చర్చచేస్తారన్న భావన కలగడం లేదు. మణిపూర్ వ్యవహారంపై చర్చించాలా వద్దా అన్న నిర్ణయం తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారు. విపక్షాలు ఆందోళన చేస్తున్నారు. స్పీకర్లు వాయిదాలు వేస్తున్నారు. తాజాగా పార్లమెంట్ వ్యవహారాల పరిస్థితి ఇది. పార్లమెంట్‌ను నడిపించేందుకు రాజనీతిజ్ఞత అవసరం. మనం ఉన్నదే ప్రజల కోసం అన్న కోణంలో అధికార పక్షం ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండి..సమస్యలపై చర్చించడం ద్వారా ప్రజలకు సందేశం ఇవ్వాలి. ఇలా నిరంకుశంగా వెళితే ఎంతటి వారికైనా ప్రజలు శిక్ష వేయక మానరు. మళ్లీ మాదే అధికారం అన్న అహంకార ధోరణి పనికిరాదు. పదేళ్లపాటు అధికారం వెలగబెట్టిన కాంగ్రెస్ అదేరీతిలో ప్రవర్తించి ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయింది. బిజెపి కూడాఇదే ధోరణితో సాగితే ప్రజలు కూడా చాపచుట్టినట్లు చుట్టి బంగాళాఖాతంలో విసరేస్తారని గుర్తించాలి. అందుకు ఇటీవలి కర్నాటక ఎన్నికలే నిదర్శనంగా చూసుకోవాలి. చట్టసభల్లో ప్రజా సమస్యలను చర్చించేందుకు విపక్షాలకు అవకాశం ఇవ్వాలి. వారు సమస్యలను ప్రస్తావిస్తే చర్చించాలి. చర్చల ద్వారా ప్రజల మనోగతాన్ని తెలుసుకునే ప్రయత్నం చేయాలి. అప్పుడే చట్టసభలకు విలువ ఉంటుంది. గతంలో ఎప్పుడూ చర్చలకు ప్రాధాన్యం ఉండేది. సమస్యలపై తక్షణ చర్చలు చేపట్టిన సందర్భాలు కూడా ఉన్నాయి. చట్టసభలకు గౌరవం ఇనుమడించేలా అధికార విపక్షాలు కలిసి పనిచేయాలి. చట్టసభలను పాలకులే ఎక్కువగా గౌరవించాలి. ప్రజల సమస్యలపై చర్చించడం అలవాటు చేసుకోవాలి. ప్రజల సమస్యలపై చర్చించిన తరవాతనే విధాన నిర్ణయాలు తీసు కోవాలి. లేకుంటే ప్రజలు ఓ కంట కనిపెడుతుంటారని గుర్తించాలి. పార్లమెంటులో మంచి సంప్రదాయం నెలకొల్పేందుకు బిజెపి నేతలు ముందుకు రాకుంటే వారికి కూడా చరిత్రగుణ పాఠం చెప్పడం ఖాయం. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివిధ రూపాల్లో చర్చించేందుకు ఉన్న అవకాశాలను వినియోగించు కోవాలి. కానీ ప్రతిష్టంభనతో సాధించేదేమీ లేదని ఇరు పక్షాలు కూడా గుర్తించాలి.